క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: ఝరాసంగం మండలంలోని జొన్నగామకు చెందిన మాజీ సర్పంచ్ తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జొన్నగామ మాజీ సర్పంచ్ బోయిని బక్కన్న, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, లక్ష్మారెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకటేశం తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్‌ఎస్ పాలన రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షుడు తట్టునారాయణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పండుగ ఏర్పాట్ల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ తిరుపతి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని అక్కమ్మ చెరువు బతుకమ్మ ఘాట్‌ను కమిషనర్ తిరుపతి సందర్శించారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో బతుకమ్మ ఘాట్ పరిసరాలను కమిషనర్ పర్యవేక్షణలో శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయించారు. బతుకమ్మ నిమజ్జనానికి తరలివచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మాణిక్యం, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీక్లబ్ కార్యదర్శి, కోశాధికారి ఎన్నిక


అర్థం రమేశ్‌కుమార్


దారం మహేశ్‌కుమార్

నారాయణఖేడ్: ఖేడ్ వాసవీక్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి సాయిబాబా ఇది వరకే ఎన్నికయ్యారు. మిగతా బాధ్యులను శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అర్థం రమేశ్‌కుమార్, కోశాధికారిగా దారం మహేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. క్లబ్ అధ్యక్షుడు కోటగిరి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఈ మేరకు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీక్లబ్ ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామని బాధ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో 88 శాతం పూర్తి చేశామని ప్రత్యేక అధికారి వీరేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి సీడీఎంఏ శాఖ రూ.74 లక్షల నిధులు మంజూరు చేసింది. అనంతరం ఇంటి పన్నుల వసూళ్లు, గృహనిర్మాణాలకు అనుమతులు, భువన్ సర్వే, ఇంజినీరింగ్ విభాగం పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. అధికారులతో కలిసి పలు వార్డుల్లో పర్యటించి స్వచ్ఛతా హీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో కమిషనర్ కిషన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పేరు మార్చొద్దు


మాట్లాడుతున్న నాయకుడు అర్జున్

హత్నూర(సంగారెడ్డి): బతుకమ్మ చీరల పంపిణీ పేరును ఇందిరమ్మ చీరగా ప్రభుత్వం మార్చాలని చూస్తే ఊరుకోబోమని బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి అర్జున్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దసరా సందర్భంగా ఆడపడుచులకు బతుకమ్మ చీర కానుకను అందించింది. అలాగే ప్రస్తుత ప్రభుత్వం కూడా పంపిణీ చేయాలన్నారు. బతుకమ్మ పేరును ఇందిరమ్మ చీరగా మారిస్తే ప్రజా వ్యతిరేకత తప్పదన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణచారి, సాయి, శ్రీనివాస్ రెడ్డి, సురేశ్, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

రైతుబజార్ కోసం ఎదురుచూపులు

- 21ఏళ్లుగా అందుబాటులోకి రాని వైనం
- 4ఏళ్లుగా అభివృద్ధి పనులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని రైతుబజార్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజా కూరగాయలు, పండ్లు కోసం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగంపల్లిలోని రైతుబజార్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 21ఏళ్లుగా రైతుబజార్ ఉన్నప్పటికీ నేటికి వినియోగంలోకి రాకపోవడం విశేషం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతుబజార్‌ను త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

2004లో రైతుబజార్..

2004లో రూ.40లక్షల నిధులతో నాటి రామచంద్రాపురం బొంబాయి కాలనీలో రైతుబజార్‌ను అభివృద్ధి చేసి ప్రారంభించారు. కానీ రైతులు మాత్రం రైతుబజార్‌లో కూరగాయలను విక్రయించేందుకు ముందుకు రాకపోవడంతో నాటి నుంచి నిరుపయోగంగా మారింది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా..

భారతినగర్ డివిజన్‌లో వచ్చిన రైతుబజార్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా మారుస్తూ గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి రూ.2.99కోట్లు మంజూరు చేశారు. నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి పనులు జరుగుతునే ఉన్నాయి. గత నాలుగు ఏళ్లుగా రైతు బజార్‌ను సుమారు రూ.5.6కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుతం రైతుబజార్ పనులు చివరి దశకు చేరాయి.

అందుబాటులోకి వస్తే అందరికీ లాభం..

రైతు బజార్ అందుబాటులోకి రావడం వలన స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. తాజా కూరగాయలు తక్కువగా ధరకే లభించే అవకాశం ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వల్ల అన్ని వస్తువులు ఒక్క దగ్గరే లభిస్తాయి.

104దుకాణాలు..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాలుగు భారీ షెడ్లను ఏర్పాటు చేశారు. ఒక్క షెడ్డులో సుమారు 26దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 104దుకాణాల్లో కూరగాయలు, పండ్లు, మాంసం, పూలు, నిత్యావసర సరుకులు ఒకేచోట లభించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

త్వరలో ప్రారంభం



ఇంటిగ్రేటెడ్ రైతు బజార్‌ను త్వరలో ప్రారంభిస్తాం. ప్రజలకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తాం. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగింది. ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయిలు కల్పించడం జరిగింది.

– వి.సింధు రెడ్డి, కార్పొరేటర్, భారతినగర్ డివిజన్

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధే లక్ష్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి


పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే, కాసాల దేవులపల్లి దౌల్తాబాద్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బైత కుటుంబాలకు రూ. 9 లక్షల ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. సొంత నిధులతో గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి హకీం, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రాజేందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, పలు గ్రామాల నాయకులు ఉన్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతలు తప్పనిసరి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: మ్యాన్‌హోల్స్‌పై మూతలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ హెచ్ఎండబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని డ్రైనేజీ, నాలా, మ్యాన్‌హోల్స్ సమస్యలపై సమగ్ర పరిశీలన చేసి, సమస్యలు ఉన్న చోట్ల తక్షణ మరమ్మతులు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని చెప్పారు. అదేవిధంగా కలుషిత నీరు తాగు నీటిలో కలువకుండా చూడాలన్నారు. సోమవారం లోపు సమగ్ర పరిశీలన చేపట్టి, సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం శివకృష్ణ, మేనేజర్ అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దిగుబడులు సాధించడంపై ఆసక్తి చూపాలి

వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి

జహీరాబాద్: రైతులు విత్తనం ఎంపిక నుంచి పంట చేతికి అందే వరకు సాగు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపినట్లయితే మంచి ఫలితాలు సాధించగలుగుతారని జహీరాబాద్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి అన్నారు. శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. సాగులో ఉన్న పంటలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, ఏయే సందర్భంలో ఎలాంటి మందులను పిచికారీ చేసుకోవాలి, ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలనే దానిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టనట్లయితే పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త విజయలక్ష్మి, మొగుడంపల్లి ఏఓ అజారుద్దీన్, కేవీకే శాస్త్రవేత్తలు సి.వరప్రసాద్, సాయిప్రియాంక పంటల సాగు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులు పంటల సాగుపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు సి.బాల్‌రాజ్, మల్లారెడ్డి కళాశాల ప్రతినిధి యువరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి


ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వివరిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సిద్దార్థకాలనీ రోడ్డు సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం అమీన్‌పూర్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ఆధ్వర్యంలో సిద్దార్థ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ రోడ్డు విషయంపై అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికు ఫోన్‌చేసి సమస్యను త్వరలో పరిష్కంచాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, షణ్ముఖ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కావాలని తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పర్యావరణంలో సమతుల్యత ఉన్నప్పుడే జీవరాశి మనుగడ సాధ్యమవుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధిపతి డాక్టర్ ఎస్.విజయ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వాణి, డాక్టర్ జ్యోష్ణ ఎన్ఎస్ఎస్. వాలంటీర్లు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని గురుకుల పాఠశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు దసరా సెలవుల నేపథ్యంలో ముందస్తు పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగు పూలతో బతుకమ్మను పూజించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పండుగను జరుపుకొన్నారు. మహిళా ఉపాధ్యాయులు ప్రకృతిని మాతను కొలుస్తూ ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటగిరీల వారీగా మ్యాపింగ్

కలెక్టర్ ప్రావీణ్య


సమావేశంలో మాట్లాడుతున్న ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 24 లోపు కేటగిరీల వారీగా మ్యాపింగ్ పూర్తి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ 2025 పకడ్బందీగా చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ మాధురి పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం


రాంబాబు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల ఇన్‌చార్జి ఎంఈఓ రాంబాబు వీడ్కోలు సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ పరమేశం, కమిషనర్ దశరథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు, నాయకులు రాంబాబు సేవలను కొనియాడుతూ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కుమార స్వామి, నాయకులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు బంగారు పతకం

న్యాల్‌కల్(జహీరాబాద్): నూతన వంగడాలను రైతులకు అందించేందుకు మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామ శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. నీటి ఎద్దడిని తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే పలు రకాల(చెరకు)కొత్త వంగడాలను రైతులకు అందించిన ఇక్కడి శాస్త్రవేత్తలు షుగర్ బీట్(చక్కెర దుంప) నూతన వంగడాన్ని అభివృద్ధి చేశారు. నూతన వంగడాన్ని అభివృద్ధి చేసిన చెరకు పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్‌ను బంగారు పతకం వరించింది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఎస్ఐఎస్ఎస్‌టీపీ బృందం సభ్యులు శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌కు బంగారు పతకాన్ని బహూకరించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, ఒక్కరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ కొనసాగుతున్న వైద్య శిబిరాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ వారి సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని కల్బేమల్, బసంత్‌పూర్‌లో వైద్యులు గణేశ్‌కుమార్ పశువులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

◆ మెనూ ప్రకారం భోజనం ఇవ్వండి

నారాయణఖేడ్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం, మండల ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్ హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. నిజాంపేట్ మండలం బాచేపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సరుకుల వివరాల నాణ్యతను పరిశీలించారు.

◆ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించండి

నారాయణఖేడ్: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని ఎంపీడీఓ సంగ్రాం సూచించారు. శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను పరిశీలిస్తూ వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేసి బిల్లులు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

◆ దీక్షలు స్వీకరించిన గిరిజనులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని సేడగుట్ట తండాలో పూజారి రవిరాథోడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పూల్‌సింగ్ మహరాజ్ చేతుల మీదుగా గిరిజనులు సేవాలాల్ దీక్షలు స్వీకరించారు. విజయదశమి పురస్కరించుకుని 11 రోజుల పాటు బంజారాలు జగదాంబ మాత, సేవాలాల్ దీక్షలు చేపడుతారు. ఈ మేరకు రవిరాథోడ్ నియోజకవర్గంలోని వంద మంది దీక్షపరులకు మాలధారణ చేయించారు.

◆ ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ తదితరులు శుక్రవారం మండలంలోని సత్వార్, బుర్దిపాడ్, కాశీంపూర్ గ్రామాలకు వెళ్లి అతిష్ మియా, ముబీన్, శ్రీకాంత్, సంగీత, లక్ష్మి, సంగీతలకు రూ.1.54 లక్షల చెక్కులను అందజేశారు.

◆ చెక్కుల పంపిణీ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్


ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: హిందీ భాష స్వాతంత్ర్యం రావడంలో కీలక పాత్ర పోషించిందని.. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హిందీ భాషకు 1949లో జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు రావాలని హిందీ దివస్ వారోత్సవాలు నిర్వహించుకుంటామన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ పూనం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యోగిబాబు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పదేళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వని బీఆర్‌ఎస్

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి


రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

జోగిపేట(అందోల్): గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. రేషన్‌కార్డు లేకపోవడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. తెల్లరేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 1121 మంది లబ్ధిదారులకు తెల్లరేషన్ కార్డులను అందించామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.22.02 లక్షల విలువైన చెక్కులను అందజేశామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, అందోల్ నియోజకవర్గం మరింతగా వెనుకబడి పోయిందని విమర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహ హయాంలోనే అందోల్ నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జీఆర్.నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు మల్లయ్య, ఎస్.సురేందర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగూరుకు భారీ వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఏడు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువభాగంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో పెరుగుతుంది. ప్రాజెక్టులోకి 52,139 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో చేరుతుండటంతో 14,4,5,3,8,9,10 నంబర్ క్రస్టు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.215 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగతా వాటర్‌ను దిగువకు వదులుతున్నారు.

ఓటర్ జాబితా నుంచి పేర్ల తొలగింపు


ఓటర్ జాబితాలను పరిశీలిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): మృతి చెందిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి బూత్ లెవల్ అధికారులు తొలగిస్తున్నారని ఉప తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. శుక్రవారం మునిపల్లిలో బూత్ లెవల్ అధికారులు ఒక వ్యక్తికి ఒకే వార్డులో రెండు ఓట్లు ఉన్న వారివే కాకుండా ఓటర్ జాబితాలో పేర్లు ఉండి మృతి చెందిన వారి పేర్లను తొలగిస్తున్నట్లు చెప్పారు. రెండు చోట్ల ఓటర్ లిస్టులో పేర్లు ఉంటే వారి పేర్లను కూడా పరిశీలించి ఒకే దగ్గర ఓటు వేసేలా పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పండగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

ఎస్పీ పరితోశ్ పంకజ్



సంగారెడ్డి జోన్: బతుకమ్మ, దసరా పండగలను పురస్కరించుకుని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించటంతో పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్తున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సొంత గ్రామాలకు వెళ్లటంతో ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని అన్నారు. ముందస్తుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రయాణాలలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, పరిమిత వేగంలో వెళ్లాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని సూచించారు.

ప్రజలకు పోలీసుల సూచనలు

బంగారు నగలు, నగదు ఉంటే బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.

- ◆ గ్రామాలకు వెళ్తున్నప్పుడు పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- ◆ విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ◆ ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలి.
- ◆ ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని మొబైల్ ఫోన్‌కు అనుసంధానం చేసుకోవాలి.
- ◆ అనుమానాస్పదంగా తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్‌కు గాని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.